కథావేదిక

# తథాస్తు

**- కె.వి.రామకృష్ణ**

అప్పుడే సినిమా నుంచి వచ్చి కారు గేరేజ్‌లో వుంచి గేటుకి తాళం వేస్తున్న రామారావుకి ఇంట్లో ఫోను అదేపనిగా మోగడం వినిపించింది. గబగబా తలుపు తాళం తీసి ఇంకా రింగవుతున్న ఫోన్ అందుకుని ''హలో'' అన్నారాయన.

''ఎవరు రామారావుగారేనా మాట్లాడేది?''

''ఆ! నేనే! మీరూ...?''

''నేనేనండీ బాబు..కుమారస్వామిని. అదేనండీ పెళ్లిళ్ల పేరయ్యను.''

''ఓ మీరా! ఏం అనుకోకండి. వెంటనే గొంతు పోల్చుకోలేకపోయాను.''

''భలేవారే! నా గొంతును వెంటనే పోల్చుకోవడానికి నేనేమైనా ఎన్టీఆర్‌నా, ఎఎన్ఆర్‌నా?''

''అది సరే. ఇంత రాత్రివేళ ఫోన్ చేశారేంటి? ఇంతకీ మొన్న మా అమ్మాయిని చూసి వెళ్లిన గుడివాడ సంబంధం గురించి ఏమైనా తెలిసిందా?''

''భలేవారే! ఆ సంగతి తెలుసుకునే మీకు ఫోన్ చేస్తున్నాను''

అంతవరకూ సరదాగా మాట్లాడుతున్న రామారావులో కంగారు మొదలయింది.

''ఇంతకీ ఏమన్నారు? మా అమ్మాయి వాళ్లకి నచ్చిందా లేదా?''

తన కూతురు అందమైనదీ, తెలివిగలదీ అని తెలిసినా సగటు ఆడపిల్లల తండ్రిలాగే అడిగాడు.

''నచ్చకేమండీ బాబు. దివ్యంగా నచ్చింది. మా తమ్ముడి కుమార్తె వివాహానికి గుడివాడకు వెళ్లవలసి వచ్చింది. అనుకోకుండా ఆ వివాహానికి పెళ్లికొడుకు తండ్రి సుదర్శనరావుగారు కూడా రావడం తటస్థించింది. ఎలాగు వచ్చారుకదాని మాటల సందర్భంలో మీ అమ్మాయి విషయం కదిపాను. వాళ్లందరికీ మీ అమ్మాయి నచ్చిందని చెప్పారు. మిగతా విషయాలు మాట్లాడడానికి మంచిరోజు చూసుకుని వస్తామని, ఆ విషయమే మీకు ఉత్తరం రాస్తామనీ అన్నారు. నేను ఈ సాయంత్రమే గుడివాడ నుండి వచ్చాను. ఈ విషయం మీకు చెప్పేవరకూ నా మనసు మనసులో లేదు. ఎప్పుడెప్పుడు ఈ శుభవార్త మీ చెవిలో వేద్దామా అనే ఆత్రుతలో సాయంత్రం నుంచి అదేపనిగా ఫోన్ చేస్తున్నాను. ఇప్పటికి మామీద దయ కలిగి మీరు ఫోన్ తీసారు'' అంటూ తన సుదీర్ఘ ఉపన్యాసాన్ని ముగించారు.

''చాలా మంచివార్త చెప్పారండీ. వాళ్లనుండి ఉత్తరం రాగానే ఏ సంగతీ మీకు కబురు చేస్తాను'' అన్నాడు రామారావు.

''మంచిది అలాగే కానివ్వండి'' అంటూ ఫోను పెట్టేశాడు కుమారస్వామి.

రామారావు నుదుటికి పట్టిన చెమట తుడుచుకున్నాడు.

రామారావు తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. తండ్రి చిన్నతనంలోనే చనిపోతే అతనిమీద తల్లి పంచప్రాణాలు పెట్టుకుని పెంచింది. రామారావు కూడా మంచి మార్కులతో పాసవుతూ చిన్న వయసులోనే మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. రామారావు భార్య పేరు లక్ష్మి. వాళ్లకి ఇద్దరు పిల్లలు. మోహన్, గాయత్రి. మోహన్ ఈ ఊళ్లోనే లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. గాయత్రి ఎంకాం ఫైనల్ ఇయర్ చదువుతోంది. చాలా బుద్ధిమంతురాలు. రామారావు, లక్ష్మి తమ పిల్లలిద్దర్ని చూసి మురిసిపోని క్షణంలేదు.

రామారావు ఎదురుగా కనిపిస్తున్న తల్లి ఫోటోవంక తదేకంగా చూశాడు. ఆ ఫోటోను చూస్తున్నప్పుడల్లా అతని గుండెలు బాధతో బరువెక్కుతాయి. అమ్మ అన్న మాటలు గుర్తొచ్చాయి ''గాయత్రికేంరా బంగారు బొమ్మ. ఎంతో అదృష్టవంతుడు అయితేనే దానికి మొగుడు అవుతాడు. చూడు నేను చెప్తున్నాను. దానికి చూసే మొదటి సంబంధమే ఖాయమైపోతుంది'' అని తరచుగా అంటుండేది. అమ్మ చెప్పింది నిజమే అయింది. చూసిన మొదటి సంబంధమే ఖాయమయ్యేటట్టుంది.

ఈ రోజు గాయత్రి పుట్టినరోజు. ఐదేళ్లక్రితం ఇదేరోజున అందరు కల్సి సరదాగా గాయత్రి పుట్టినరోజును జరుపుకున్నారు. అప్పుడు అమ్మ చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. గాయత్రి అంటే అమ్మకు పంచప్రాణాలు.

అది పుట్టగానే నట్టింట్లో లక్ష్మీదేవి పుట్టిందని తెగ సంబరపడిపోయింది. అలాగే గాయత్రికి కూడా బామ్మంటే వల్లమాలిన ప్రేమ. ఆరోజు పుట్టినరోజును సరదాగా జరుపుకుని రాత్రి పడుకున్న తరువాత పొద్దునే పాలవాడు ఎన్నిసార్లు తలుపు కొట్టినా, బెల్ మోగించినా అమ్మ తలుపు తీయలేదు. మామూలుగా అయితే అమ్మ పాలవాడు వచ్చే సమయానికి ముందుగానే లేచి వంటిల్లు సర్దే కార్యక్రమంలో మునిగిపోతుంది.

అటువంటిది ఈరోజు పాలవాడు అన్నిసార్లు బెల్ మోగించినా అమ్మ లేవడంలేదంటే... నాకెందుకో కంగారు మొదలైంది. తడబడుతున్న అడుగులతో అమ్మ దగ్గరికి వెళ్లి తట్టిలేపాను. వళ్లు చల్లగా ఉంది. అంతే! అంతా అర్థమైంది. నాకెందుకో ఆ సమయంలో ఏడుపురాలేదు. నిర్ఘాంతపోయి అమ్మవంక మూగవాడిలా చూస్తుండిపోయాను. లక్ష్మి, గాయత్రి, మోహన్‌లయితే అమ్మ మీద పడి హృదయ విదారకంగా ఏడుస్తున్నారు.

అమ్మ దూరమైంది కాని ఆ అమృతమూర్తి జ్ఞాపకాలు మిగిలిపోయాయి. ఆ జ్ఞాపకాలు మనసు పొరల్ని తొలగించుకుని, గుర్తొచ్చినప్పుడల్లా అతడు ఏదో పోగొట్టుకున్నవాడిలా అయిపోతాడు. ఆ విషయం లక్ష్మికి తెలుసు, గాయత్రి పుట్టినరోజు వస్తే ఆయన మనసు మనసులో వుండదని. అందుకే సాధ్యమైనంతవరకూ అత్తగారి ప్రస్తావన అతని దగ్గర తీసుకురాదు.

రామారావు మూడ్‌ని మార్చడానికి వేరే విషయాలేవో చెప్పి, సరదాగా మాట్లాడింది లక్ష్మి. ఆ తర్వాత ఫోన్ విషయం ఆమెకి చెప్పలేదని అతనికి గుర్తొచ్చింది.

రామారావు నవ్వడానికి ప్రయత్నిస్తూ ''చాలా మంచివార్త లక్ష్మి. మొన్న గుడివాడ నుంచి వచ్చి గాయత్రిని చూసి వెళ్లారు చూడు. వాళ్లకు మనమ్మాయి నచ్చిందట. మిగిలిన విషయాలు మాట్లాడడానికి వస్తున్నట్టుగా కుమారస్వామి ఫోను చేసి చెప్పాడు. ఏది ఏమైనా అమ్మ అన్నట్లు గాయత్రి చాలా అదృష్టవంతురాలు లక్ష్మి'' అంటూ కూతురి వంక తిరుగుతూ–

''ఏమ్మా అబ్బాయి నీకు నచ్చాడు కదా?'' అన్నారు.

గాయత్రి సిగ్గుతో తల వంచుకుని తన గదిలోకి వెళ్లిపోయింది.

తల్లిదండ్రులతోపాటు మోహన్ కూడా జరగబోయే నిశ్చితార్థానికి తగిన ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యాడు.

• • •

రెండురోజుల తరువాత గుడివాడ నుంచి సుదర్శనరావుగారి ఉత్తరం అందింది. అమ్మాయి ఇంటిల్లిపాదికీ బాగా నచ్చిందనీ, మిగిలిన విషయాలు మాట్లాడడానికి, ముహూర్తాలు పెట్టుకోవడానికి ఇంకో వారంరోజుల్లో అక్కడకు వస్తున్నట్లుగా రాశారు.

ఆ ఉత్తరం అందుకున్న దగ్గర నుంచి రామారావుకి కాలు నిలవడంలేదు. ఒకటే కంగారు. ఒక్కగానొక్క కూతురు. పెళ్లి చాలా ఘనంగా చేయాలి అన్న ఆలోచనే ఆయనకి ఎప్పుడూ.

అమ్మాయికి వివాహం నిశ్చయమైందని, ఎంగేజ్‌మెంట్‌కు రమ్మని స్నేహితుల్ని, దగ్గర బంధువుల్ని పేరు పేరున ఆహ్వానించాడు. గాయత్రి కూడా తన స్నేహితుల్ని పిలిచింది. రామారావు ఇల్లు అప్పుడే పెళ్లివారి ఇంటిని తలపించింది.

• • •

సుదర్శనరావు కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లడానికి సామాన్లు సర్దడంలో మునిగిపోయారు.

అదే సమయంలో ఆయన మేనమామ వచ్చాడు. ఇంట్లో జరుగుతున్న హడావుడిని చూసి ఆశ్చర్యపోతూ ''ఏంటి సుదర్శనం! ప్రయాణం రేపు సాయంత్రమయితే అప్పుడే హడావుడి పడుతున్నారేమిటి?'' అని అన్నారు.

''భలేవాడివే మామయ్యా! ఇంత తీరిగ్గా సర్దుకుంటేనే రేపు సాయంత్రానికి తేలిగ్గా వుంటుంది. బయలుదేరే సమయానికి హడావుడి ఎందుకని ఇప్పుడే సర్దేసుకుంటున్నాము'' అని చెప్పాడు సుదర్శనరావు.

''భరత్ నిశ్చితార్థానికి బయలుదేరుతున్నారు బానే వుంది. మరి స్వాతి గురించి ఏమాలోచించావు?''

''ఏం వుంది. వీడి పెళ్లి అయిన తరువాత దానికి సంబంధాలు చూడవచ్చు. మంచి సంబంధాలు అనుకున్నప్పుడు రావుకదా! స్వాతికి కూడా సంబంధాలు చూస్తూనే ఉన్నాము. పెళ్లివాళ్లు కూడా స్వాతిని చూసి చాలా జాలి పడ్డారు. దాని పెళ్లి ఎప్పుడు జరగాలని దేవుడు రాశాడో అప్పుడే జరుగుతుంది!''


''ఈ మెట్ట వేదాంతాలు కట్టిపెట్టు. అయినా పెళ్లి కావాల్సిన అమ్మాయిని ఇంట్లో పెట్టుకుని అబ్బాయికి ఎవరైనా పెళ్లి చేస్తార్రా ముందు. మన అమ్మాయికేం బంగారుబొమ్మలా వుంటుంది. ఆ పాడు స్కూటర్ ప్రమాదంలో కాలు పోయింది, అంతేగా? అంత మాత్రానికే వచ్చిన వాళ్లందరూ అమ్మాయిని తిరస్కరించాలా?''

''ఎవరిష్టం వారిది మామయ్యా. ఎవరైనా చేసుకునే అమ్మాయికి ఎలాంటి లోపాలు ఉండకూడదని కోరుకుంటారు. మన అమ్మాయి దురదృష్టవంతురాలు. అందముంది, చదువుంది...కానీ ఏం చేస్తాం, దేవుడు ఆ లోపాన్ని ఇచ్చాడు. దాని సంగతి కూడా ఆ భగవంతుడే చూసుకుంటాడు''

''ఇదిగో సుదర్శనం! చేతకాని కబుర్లు మానేయ్. నువ్వు వింటానంటే నాకు తోచిన సలహా ఒకటి ఇస్తాను. వింటావా?''

''చెప్పు మామయ్యా. నీ మాట ఎప్పుడు కాదన్నాను''

''ఏం లేదురా! మన అబ్బాయికి ఆ అమ్మాయి బాగా నచ్చిందని చెప్పావు. అలాగే వాళ్లకీ మన అబ్బాయి బాగా నచ్చాడని కూడా అన్నావు. ఆ అమ్మాయికి ఒక అన్నయ్య ఉన్నాడని, మంచి ఉద్యోగంలో ఉన్నాడని కూడా అంటున్నావు. నా మాట విని నేను చెప్పినట్లు చేయి. మీ అబ్బాయికి మా అమ్మాయిని చేసుకుంటే, మా అబ్బాయిని మీ అమ్మాయికి ఇవ్వడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫోన్ చేయి. ఆ




## సాక్షి కక్ష సాధింపు



సాక్షిశివానంద్ ఈమధ్య మళ్ళీ వార్తల్లో కొచ్చింది. అది, ఏదో అవార్డ్ సంపాదించో లేక హిట్స్ కొట్టేసో కాదు... ఒకప్పుడు చేసినట్టే నిర్మాతలను ఏడిపించడం చరిత్ర పునరావృతం చేసింది. అది కూడా అల్లాటప్పా నిర్మాతలను ఏడిపించడం కాదు, యూనిట్‌లోని వాళ్ళను కొట్టి, తిట్టి భయపెట్టే మోహన్‌బాబుని! జరిగింది తప్పో, ఒప్పో అన్నది పక్కనపెడితే మోహన్‌బాబుని ఏడిపించడమంటే మాటలు కాదు. సాక్షి మహా ధైర్యస్థురాలో లేదా గుండెలు తీసిన బంటో అయివుండాలి. ఇదిలా వుంటే, మరో వర్గం వాళ్ళు ఏమంటున్నారంటే, సాక్షి ఇబ్బందులు పెట్టే మాట వాస్తవమేగానీ 'యమజాతకుడు' నిర్మాతలను మరీ అంతగా ఇబ్బంది పెట్టడానికి చాలావరకూ పాత కక్షలే కారణం అయి ఉండొచ్చు అని. అప్పట్లో 'కలెక్టర్‌గారు' సినిమా షూటింగ్‌లో మోహన్‌బాబు సాక్షిని బెదిరించి ఎక్స్‌పోజింగ్ చేయించాడు. అప్పుడు ఆమె ఇండస్ట్రీకి కొత్త. ఇప్పుడు తను స్టార్ ఇమేజ్ సంపాదించుకుంది. సగం సినిమాలో తొలగిస్తే అసలే కష్టాలలో ఉన్న మోహన్‌బాబు మరింత నష్టపోతాడు. అందుకే ఆలోచించి 'దెబ్బకు దెబ్బ' కొట్టింది సాక్షి అంటున్నారు. మోహన్‌బాబు కోపం తగ్గడానికి ఇదీ ఒక కారణమేమో!

- జె.వి. బాబు




తరువాత సంగతి అంతా నేను చూసుకుంటాను. ఏమంటావు?''

సుదర్శనరావుకి ఏం మాట్లాడాలో తెలియలేదు.

''ఏరా! నేను చెప్పినదానికి నువ్వు ఒప్పుకున్నట్టేనా?''

''అదికాదు మామయ్యా! అంతా మాట్లాడుకుని ఇప్పుడు మా అమ్మాయిని చేసుకుంటేనే మీ అమ్మాయిని చేసుకుంటామని చెబితే ఏం బావుంటుంది చెప్పు. అదీకాక ఆ అబ్బాయి అభిప్రాయం ఏమిటో మనకు తెలియదు. అటువంటప్పుడు ఈ ప్రపోజల్ పెడితే...''

''బాగుండదంటావు! అంతేనా! ఇక నువ్వేం మాట్లాడకు. నేను చెప్పినట్లు ఫోన్ చేసి చెప్పు. వాళ్ళు కూడా అమ్మాయిని చూసి బాధపడ్డారని అన్నావుగా. ముందు మనమొక రాయి వేద్దాము. తగిలితే అదృష్టమే. లేదంటే తర్వాత సంగతి ఆలోచించవచ్చు'' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు ఆయన.

వెళ్తున్న ఆయన వంక అలాగే చూస్తూ ఉండిపోయాడు సుదర్శనరావు.

• • •

రామారావు కుటుంబ సభ్యులంతా హాల్లో కూర్చుని నిశ్చితార్థం ఏర్పాట్లు ఎలా చేయాలో మరోసారి చర్చించుకుంటున్నారు.

''భోజనాలు వడ్డించాను రండి. తరువాత తీరిగ్గా మాట్లాడుకుందురుగాని'' అంటూ లోపలినుంచి లక్ష్మి పిలిచింది.

చేస్తున్న పనిని ఆపి అందరూ డైనింగ్‌హాల్లోకి నడిచారు. భోజనం మధ్యలో వుండగా ఫోన్ మోగింది.

రామారావు లేచి ఫోనందుకున్నారు.

అవతలివారు చెబుతున్న విషయాలను వింటున్న రామారావు ముఖంలో రంగులు మారసాగాయి. ఐదు నిముషాల తరువాత ఫోన్ పెట్టేసి నీరసంగా డైనింగ్ టేబుల్ వద్దకు వచ్చారు.

పాలిపోయిన ముఖంతో నీరసంగా వస్తున్న భర్తను చూసి లక్ష్మి ''ఎవరి దగ్గర నుంచి ఫోను?'' ఆత్రంగా అడిగింది.

రామారావు మౌనమే సమాధానం అయింది.

వినకూడని వార్త ఏదో విన్నట్లుగా అక్కడివారికి అర్థమైంది.

రెండు నిముషాల అనంతరం రామారావు మెల్లగా ''సుదర్శనరావుగారు ఫోన్ చేసారు. రేపు వాళ్లు రావడంలేదుట''.

''ఏం? ఎందుకు?'' లక్ష్మి ప్రశ్నించింది.

ఎలా చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయారు.

''మిమ్మల్నే అడిగేది. వాళ్లు ఎందుకు రావడం లేదు?'' రెట్టించింది లక్ష్మి.

''సుదర్శనరావుగారికి ఒకమ్మాయి ఉంది తెలుసుగా. ఆ అమ్మాయిని మోహన్ చేసుకుంటేనే వాళ్ల బ్బాయి మనమ్మాయిని చేసుకుంటాడుట. బాగా ఆలోచించుకుని ఏ సంగతి వాళ్లకి తెలియజేస్తే నిశ్చితార్థానికి వస్తారట'' చెప్పలేక చెప్పాడు రామారావు.

ఒక్కసారిగా అందరూ అవాక్కయిపోయారు. ఎవరి నోటివెంట మాట రాలేదు.

ముందుగా లక్ష్మి తేరుకుని ''ఇదేం అన్యాయమండీ. ముందు అంతా ఒప్పుకుని తీరా నిశ్చితార్థం రేపనగా కుండ మార్పిడి చేసుకుందామని అంటారా? ఇదేమన్నా మర్యాదస్థుల లక్షణమేనా. ఆయన చెప్పినదానికి మీరేమన్నారు?'' అంది.

''ఏమంటాను? ఆలోచించి చెప్తానన్నాను.''

''ఇంక ఆలోచించడం అనవసరం. పెళ్లికి ముందే ఇన్ని అడ్డంకులు కల్పించినవారు, రేపు పెళ్లయ్యాక గొంతెమ్మ కోరికలు కోరరని నమ్మకం ఏముంది? మనమ్మాయికి కాలు వంకరా చేయి వంకరా? పైగా ఆ కుంటి అమ్మాయిని మన మోహన్ చేసుకోవాలా? నేను చస్తే ఒప్పుకోను. ఈ పెళ్లిని మేమే క్యాన్సిల్ చేసుకుంటున్నామని ఇప్పుడే వాళ్లకి ఫోన్ చేసి చెప్పండి'' అంది లక్ష్మి ఆవేశంగా.

రామారావు ఏం మాట్లాడకుండా భోజనం ముగించి తన గదిలోకి వెళ్లిపోయాడు. మిగిలినవారు మౌనంగా తమ భోజనాలు పూర్తి చేశారు.

• • •

పడుకున్నదన్నమాటేగానీ గాయత్రికి ఎంతసేపటికి నిద్ర రావడంలేదు. ఆలోచనలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి. భరత్ చదువుకున్నవాడు, అందగాడు.

అతని మాటతీరు తననెంతో ఆకర్షించింది. ఈ విషయమే అన్నయ్య మోహన్‌తో కూడా చెప్పింది. పెళ్లిచూపుల్లో ఆదర్శభావాలు కలిగినవాడిలా అనిపించిన అతనిలో ఇంత స్వార్థం వుందా? తల్లిదండ్రులు చెప్పిందానికి గంగిరెద్దులా తల ఊపడమేనా? తనకంటూ సొంత అభిప్రాయాలు వుండవా? అతన్ని పెళ్లి చేసుకోకపోతే కలిగే బాధ కొద్దిరోజులే వుంటుంది. అన్నయ్యకి ఇష్టం లేని పెళ్లి బలవంతంగా జరిపించడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదు అని నిర్ణయించుకున్నాక గాయత్రి హృదయవేదన తగ్గింది.

• • •

మరో గదిలో మోహన్ ఆలోచనలు పరిపరి విధాలుగా పోతోంది. చెల్లి పెళ్లిని తన పెళ్లితో ముడిపెట్టడం అతనెంత మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాడు. తన అంగీకారం మీదనే గాయత్రి భవిష్యత్తు ఆధారపడి వుంది. ఆమెను పెళ్లి చేసుకోనని చెప్తే చెల్లెలు ఎంతో ఇష్టపడిన

సంబంధం తప్పిపోతుంది! ఇప్పుడు తనేం చేయాలి? ఎటూ నిర్ణయించుకోలేకపోతున్నాడు.

గాయత్రి పెళ్లి చూపుల్లో స్వాతిని చూసాడు. ఆ అమ్మాయి అందంగా, అణుకువగా వుంది. ఆమెకి జరిగిన ప్రమాదం పెళ్లయిన తరువాత జరిగి వుంటే? అంతే! మోహన్ ఇంక ఆలోచించలేదు. ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చినవాడిలా లైట్ ఆర్పి పడుకున్నాడు.

• • •

అక్కడ భరత్ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏంలేదు. తల్లిదండ్రుల ప్రవర్తన అతనికెంతమాత్రం అర్థం కావడంలేదు. ముందు అమ్మాయి నచ్చిందని చెప్పి ఇప్పుడు ఇలా మాట్లాడడం భరత్‌కి నచ్చడంలేదు. అనవసరంగా గాయత్రికి మాట ఇచ్చి ఆమె దృష్టిలో తను స్వార్థపరుడిగా మారిపోయాడు. తన గురించి ఆమె ఏమనుకుంటుంది? పెళ్లిచూపులకు ముందే తల్లిదండ్రులు ఈ విషయం చెబితే పరిస్థితి వేరుగా వుండేది. ఇప్పుడు తనేం చేయాలి? ఎటూ నిర్ణయించుకోలేకపోతున్నాడు.

• • •

ఆ రోజు ఆదివారం కావడంవల్ల అందరూ ఇంట్లోనే ఉన్నారు. హాల్లో రామారావు, లక్ష్మి సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగితే ఈరోజు గాయత్రి నిశ్చితార్థం వైభవంగా జరిగి వుండేది! గాయత్రి, మోహన్ తాము తీసుకున్న నిర్ణయాన్ని తల్లిదండ్రులకు చెప్పడానికి హాల్లోకి వచ్చారు.

కాలింగ్ బెల్ మోగడంతో లక్ష్మి తలుపు తీసింది. ఎదురుగా భరత్!

అతన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఎవరికీ ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. చివరికి ''లోపలికిరా బాబూ'' అంటూ లక్ష్మి సాదరంగా అతన్ని ఆహ్వానించింది.

భరత్ సోఫాలో కూర్చుని లక్ష్మి ఇచ్చిన కాఫీని మౌనంగా అందుకున్నాడు.

ఐదు నిముషాల అనంతరం భరత్ రామారావును ఉద్దేశించి-

''ఇలా జరుగుతుందని నాకు తెలియదు. తెలిసుంటే వ్యవహారం ఇంతదూరం వచ్చేదికాదు. ఇందులో నా ప్రమేయం ఎంతమాత్రంలేదు.

నా చెల్లెలికి మంచి వరుడ్ని చూసి పెళ్లి చేయడం అన్నగా నా కర్తవ్యం. నా ధర్మాన్ని నేనెప్పుడూ విస్మరించను. నా చెల్లెలు పెళ్లిని నా పెళ్లితో ముడిపెట్టడం మావాళ్ల తప్పే. మావాళ్ల తరఫున నేను క్షమాపణ కోరుకుంటున్నాను. మీ అమ్మాయి నాకు మనస్ఫూర్తిగా నచ్చింది. మీరొప్పుకుంటే గాయత్రిని పెళ్లి చేసుకోవడానికి నాకేలాంటి అభ్యంతరంలేదు'' అంటున్న భరత్ వంక వాత్సల్యపూరితంగా చూసారు లక్ష్మి, రామారావులు.

''ఉన్నతమైన నీ సంస్కారానికి మాకెంతో సంతోషంగా వుంది బాబూ. కానీ పెద్దవాళ్లను కాదని పెళ్లి చేసుకోవడం మాకెంతమాత్రం ఇష్టంలేదు.

ఇరుపక్షాలు అంగీకరిస్తేనే మీ పెళ్లి జరుగుతుంది'' అంటున్న రామారావు మాటలకు మోహన్ అడ్డొచ్చి-

''నాన్నా! మీరేం అనుకోనంటే నా నిర్ణయం చెబుతాను. నేను స్వాతిని పెళ్లి చేసుకోవడానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. నేనేదో త్యాగం చేసానని అనుకోవడంలేదు. ఇది నేను తొందరపాటుతో తీసుకున్న నిర్ణయం కూడా కాదు. అంతా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఒకవేళ ఆ ప్రమాదం పెళ్లి తరువాత జరిగుంటే ఏం చేసేవాళ్లం? మీరిక ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా వాళ్లకు ఫోన్ చేసి చెప్పండి'' అంటున్న మోహన్ సంస్కారానికి నివ్వెరపోయాడు భరత్.

రామారావు, లక్ష్మిలు ఆనందంతో మోహన్‌ను అభినందించారు.

ఇంతలో ఫోన్ రింగయింది. రామారావు ఫోనందుకున్నాడు.

''నన్ను మీరు క్షమించాలి రామారావుగారు. ఏదో ఆవేశంలో తీసుకున్న నిర్ణయం ఇంతమందిని బాధపెడుతుందని అనుకోలేదు. రాత్రంతా ఆలోచిస్తే మేమెంత అనాలోచితంగా ప్రవర్తించామో తలచుకుంటే సిగ్గేస్తోంది.

జరిగినదంతా ఒక పీడకలగా మర్చిపోదాం. వచ్చే శుక్రవారం దివ్యమైన ముహూర్తం వుంది. మీరొప్పుకుంటే ఆ ముహూర్తానికి నిశ్చితార్థం జరుపుకుందాము.''

''మనలో మనకు క్షమాపణలు ఎందుకండి సుదర్శనరావుగారు. మా తరఫు నుంచి కూడా మీకో శుభవార్త. మా మోహన్ మీ స్వాతిని వివాహం చేసుకోవడానికి మనస్ఫూర్తిగా అంగీకరించాడు. ఈ విషయంలో ఎవరి బలవంతం లేదు. తనకు తాను తీసుకున్న నిర్ణయమది. మీరు చెప్పినట్లుగానే మా అమ్మాయి, మీ అబ్బాయి నిశ్చితార్థంతోపాటుగా మా అబ్బాయి, మీ అమ్మాయి నిశ్చితార్థం కూడా ఏర్పాటు చేసుకుందాం..ఏమంటారు?''

కొడుకు పెళ్లి అయిన తర్వాత, అవిటిదైన తన కూతురు పెళ్లి ఎలా చేయాలో అర్థంగాక, ఆ అభాగ్యురాలి అదృష్ట దురదృష్టాలను కాలానికి వదిలేసిన సుదర్శనరావు- రామారావు చెప్పిన శుభవార్త విని, ఆనందంతో నోట మాట రాక ఫోన్ చేతిలో పట్టుకుని అలాగే నిల్చుండిపోయాడు.

★

## టైము



పల్లెటూరునించి వచ్చిన ఆసామి బస్తీబాబుని టైమడిగాడు-

''9-10 అయింది'' చెప్పాడు బస్తీబాబు.

''తొమ్మిదో-పదో నిజంగా చెప్పవయ్యా.'' బేలగా అడిగాడు ఆసామి.

## టైమ్ వేస్ట్

''సుబ్బరంగా పని ఏదైనా చేసుకోరాదా ఇలా అడుక్కోకపోతే...''

ముష్టాడికి ఉపన్యాసం అందుకున్నాడు రామారావు.

''అనవసరమైన కబుర్లు చెప్పి టైమ్ వేస్ట్ చెయ్యకండి సార్. ఏపన్చేస్తే ఎక్కువ డబ్బులు కిడతాయో మనకి బాగా తెల్సు.'' చెప్పాడు శ్రీముష్టివారు.

## అభయారణ్యం

ఓ సాయంత్రంపూట పిల్లలిద్దర్నీ కూచోపెట్టి అభయారణ్యాల గురించి పక్షుల వలస గురించి లెక్చర్ దంచాడు తండ్రి...

విని విని భార్య అంది... ''మీ ఉపన్యాసం ఆపకపోతే పిల్లలు కూడా ఏ అభయారణ్యాలకో పారిపోతారండీ.''

- బి.సూర్యచక్రధర్ (సికింద్రాబాద్)

## రెండోసారి

టీచర్- ''మానవుడు ఒకసారి చంద్రమండలం మీదకి వెళ్లాడు. రెండవసారి ఎందుకు వెళ్లలేదు చెప్పండి?'' అన అడగ్గానే

''అక్కడ లేడీస్ లేరు కనుక'' చెప్పి కూర్చున్నాడు ఓ రోమియో స్టూడెంట్.

- మదన్

